ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 4 జూన్ 2024





నిరీక్షణకు తెర

- నేడే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు
- 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనున్నది. 21 రోజులుగా ఉత్కంఠను రేకెత్తిస్తున్న ఫలితాలు వెల్లడికానున్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్‌తోపాటు 25 మంది వివిధ పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు పోటీలో ఉన్నారు. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ జరిగింది. మూడు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాలు అంతర్భాగంగా ఉన్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 17,97,150 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,77,483 మంది పురుషులు, 9,19,565 మంది మహిళలు, 102 థర్డ్‌జెండర్లు ఉన్నారు. మే 13న జరిగిన పోలింగ్‌లో ఈనెల నియోజకవర్గంలో 72.54 శాతం ఓట్లు పోలయ్యాయి. 6,34,663 మంది పురుషులు, 6,68,982 మంది మహిళలు, 45 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,625 మంది వయో వృద్ధులు, దివ్యాంగులు ఉండగా హోం ఓటింగ్ ద్వారా 1,560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 10,200 మంది పోలింగ్ సిబ్బందికిగాను 8,811, 1,018 మంది సర్వీసు ఓటర్లకుగాను 476 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 13,03,690 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఆ ఫలితాలు వెల్లడించడానికి ఎన్నికల కమిషన్ జూన్ 4న ముహూర్తం ఖరారు చేసింది.

మొత్తం పోలింగ్ శాతం: 72.54 శాతం

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	ఓటు హక్కు వినియోగించుకుంది	పోలింగ్ శాతం
కరీంనగర్	3,67,353	2,22,296	60.51
చొప్పదండి	2,33,546	1,76,001	75.36
వేములవాడ	2,26,188	1,68,373	74.44
సిరిసిల్ల	2,46,547	1,85,573	75.27
మానకొండూర్	2,25,386	1,75,228	77.75
హుజూరాబాద్	2,50,429	1,84,858	73.82
హుస్నాబాద్	2,47,701	1,91,361	77.25
మొత్తం	17,97,150	13,03,690	72.54

● పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభం

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కి స్తారు. 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, రౌండ్ల వారీగా లెక్కించిన ఓట్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తారు. ఓట్ల లెక్కింపు వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌తో ఎన్‌కోర్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కి ంపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరుగకుండా మంగళవారం కరీంనగర్‌లో 144 సెక్షన్‌ను అమలు చేశారు. ఉదయం 6 నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎస్సారార్ కళాశాల ఎదుట గల కరీంనగర్- జగిత్యాల ప్రధాన రహదారిపై రాకపోకలను నిషేధించారు. గుర్తింపు కార్డు పొందిన రాజకీయపార్టీల నాయకులు, ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం కలెక్టర్ పమేలాసత్పతి, సాధారణ ఎన్నికల పరిశీలకుడు అమిత్‌కతారియా, కౌంటింగ్ పరిశీలకు రాలు జి నజ్మాతో కలిసి పరిశీలించి, ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచ నలు చేశారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

● ఏర్పాట్లు పూర్తి

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో సీసీ కెమెరాలు, పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లను లెక్కించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ఓట్లను లెక్కిస్తారు.

- కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 395 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 18 టేబుళ్ల 22 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు.
- చొప్పదండి నియోజకవర్గంలోని 327 పోలింగ్ కేంద్రాల ఓట్లను 24 రౌండ్లలో 14 టేబుళ్లపై లెక్కిస్తారు.
- వేములవాడలోని 260 పోలింగ్ స్టేషన్ల ఓట్లను 14 టేబుళ్లపై 19 రౌండ్లలో లెక్కిస్తారు.
- సిరిసిల్ల నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాల ఓట్లను 14 టేబుళ్ల 21 రౌండ్లలో, హుజూరాబాద్‌లో 305 పోలింగ్ కేంద్రాల ఓట్లు 14 టేబుళ్ల, 22 రౌండ్లలో లెక్కిస్తారు.
- మానకొండూర్‌నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లను 14 టేబుళ్ల, 23 రౌండ్లలో, హుస్నాబాద్ నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాల ఓట్లను 14 టేబుళ్ల, 22 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రత్యేకంగా లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు ప్రత్యేక సీటింగ్ అరేంజ్ మెంట్ చేశారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మంచి నీటి వసతి, ఫ్యాన్లు, కూలర్లతోపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం 124 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 124 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 124 మందిని మైక్రో అబ్జర్వర్లుగా నియమించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిం చేందుకు 21 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లను, 35 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, 14 మంది మైక్రో అబ్జర్వర్లు నియమించారు.

● మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడే అవకాశం

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదటి రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు కొంత ఆలస్యమవుతుంది. ఆ తర్వాత లెక్కింపు ప్రక్రియ వేగంగా జరుగుతుంది. మధ్యాహ్నం మూడుగంటల వరకు తుదిఫలితాలు వెలువడే అవకాశాలుంటాయి.

● ఫలితాలపై ఉత్కంఠ

కరీంనగర్ టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుంది.. కేంద్రంలో మళ్లీ మోదీ సర్కార్ వస్తుందా... కాంగ్రెస్ కూటమి ఏర్పడుతుందా... కరీంనగర్‌లో ఎవరు గెలుస్తారు... రాష్ట్రంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తవి అంటూ పార్లమెంట్ ఫలితాలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. మరికొద్ది గంటల్లోనే ఫలితాలు తేలిపోనుండటంతో అందరిలో పార్లమెంట్ ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఎక్కడ నలుగురు కలిసినా ఓట్ల లెక్కింపు, ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. మంగళవారం రాత్రి వరకు ఎన్నికల ఫలితాలు పూర్తి స్థాయిలో వెల్లడి కానున్నాయి.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

సిరిసిల్ల రూరల్, జూన్ 3 : పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలో సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణంతోపాటు తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ రూరల్ మండలాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన సుద్దాలహిమబిందు 159వ ర్యాంక్, సిరిసిల్ల పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన మార్గం భవానీ 373, పట్టణంలోని ఆసిఫ్‌పురాకు చెందిన ఉపాధ్యాయ నందిని 347, కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ఎర్ల కౌసిక్ 228, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింత రిశ్విత 191, వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటకు చెందిన నాగారం శ్రీహర్షిత 254 ర్యాంక్ సాధించారు. సిరిసిల్ల పట్టణంలో పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ జిల్లా శాఖ అధ్వర్యంలో 45 రోజులపాటు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు 60 మంది విద్యార్థులు హాజరైనట్లు, అత్యున్నత ర్యాంకులు సాధించినట్లు అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల పున్నంచందర్ తెలిపారు. ఇందులో పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన మార్గం భవాని రాష్ట్ర స్థాయిలో 373 ర్యాంక్‌ను సాధించగా గాలి భానుశ్రీ 1395, మామిడాల నందిని 1960, గుండ్లపెల్లి వర్షన్ 2616, చేర్యాల చక్రధర్ 2963, ఒగ్గు సుశాంత్ 3309, బోద్దుల అద్వైత, గుండెల్లి సిరి, గడ్డం శివకృష్ణ, ఇప్పనపెల్లి హర్షిత్, మిట్టపల్లి తరంగిని, అమిదాల అనుష ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారిలో 5వేలలోపు ర్యాంక్‌లను మరో 26 మంది. పదివేల లోపు 41మంది విద్యార్థులు సాధించారన్నారు. ఉపాధ్యాయులతో పాటు డైరెక్టర్‌లు మండల విద్యాధికారి దూసరపుపతి, గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం, కనుకుంట్ల పున్నంచందర్, మామిడాల భూపతి, వాసాల హరిప్రసాద్, అడెపు వేణు, భైరి రవీందర్, కనుకుంట్ల తిరుమల, అంకారపు జ్ఞానోబా, గెంట్యాల భూమేష్, సామల తిరుపతి, కొక్కుల శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, కోడం రాంప్రసాద్, బోలిశ్ల భగవాన్ అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే అత్యుత్తమ విద్య



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: ప్రభుత్వ కళాశాలల్లోనే అత్యుత్తమ విద్య అందుతోందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి, తిమ్మాపూర్, గొల్లపల్లి, అక్కపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఇంటర్‌లో ప్రవేశాల కోసం అధ్యాపకులతో కలిసి సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి సర్కారు కళాశాల్లోని ఆధునిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, ప్రవళిక పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణ కోసం వైద్య శిబిరాలు

వీర్నపల్లి, జూన్ 3 : మారుమూల పేదల ఆరోగ్య రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలందించేందుకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారన్నారు. పలు వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలు అందుకోలేక పోతున్న పేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి కోసం యువకులకు పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎల్లారెడ్డిపేటలో అశ్విని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టరు అభినయ్ ఆధ్వర్యంలో వైద్యులు సేవలందించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పేద ప్రజలకు కంటి, కీళ్లతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు సుమారు వెయ్యి మందికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యశిబిరానికి వచ్చినవారికి ఎస్ఆర్‌వి రాదారపు సత్యం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట ఎస్ఐలు రమేష్, రమాకాంత్, డాక్టర్లు అభినయ్, సునీల్‌కుమార్, అజిత్, గోపికృష్ణ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ప్రజల సెంట్‌మెంట్‌తో గేమ్ ఆడుతున్న మోదీ

సిరిసిల్ల టౌన్, జూన్ 3: మతం అనే సెంటిమెంట్ పేరిట మోదీ ప్రజలతో గేమ్ ఆడుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. సోమవారం కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్తూ జిల్లా కేంద్రంలో కాసేపు కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందని, మోదీ ప్రభుత్వం వస్తే అగ్రకుల నాయకులకే ప్రయోజనం కలుగుతుందని అన్నారు. గతంలో కేదార్‌నాథ్, మొన్న కన్యాకుమారీకి వెళ్లి స్వామి వివేకానంద దగ్గర కూర్చొని మోదీ ధ్యానం చేశారని, వివేకానంద స్వామి అన్ని మతాలను సమానంగా చూసేవారని, నరేంద్ర మోదీ హిందువులపైనే ఎక్కువ ఆలోచన చేస్తూ దేశంలోని మతాలను విడదీయాలన్న ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మతాల పేరిట రెచ్చగొడుతున్నారన్నారు. మతం అనే సెంటిమెంట్ పేరిట మోదీ ప్రజలతో గేమ్ ఆడుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున ఇండియా కూటమి ఆధిక్యతను సాధించాలని కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి వచ్చినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ ఎన్డీఏకు మొగ్గు చూపుతున్నాయని, మీడియా నరేంద్ర మోదీకి, ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చాయని, ఆ ప్రభావం కూడా ప్రజలపై పడవచ్చని అన్నారు. ఈ ఎగ్జిట్ పోల్స్‌ను తాము నమ్మడం లేదన్నారు. నరేంద్ర మోదీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, బ్లాక్ మనీ తీసుకొచ్చి ప్రతీ ఒక్కరి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తానని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వలేదని, రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు. నాడు ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలను తీసుకొచ్చి ప్రభుత్వ సంస్థలను ఏర్పటు చేశారని, ప్రజలకు ఉపాధి కల్పించారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ సంస్థలను ఆదాని వంటి కార్పొరేటర్లకు అప్పగించారని మండిపడ్డారు. రెండు సార్లు ఎన్నికవడంతో దేశ రాజకీయాలు చేయాలని కేసీఆర్ తప్పు చేశాడన్నారు. తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారి కుటుంబాలకు సహాయం అందించేందుకు ఆలోచన చేయలేదని, పంజాబ్, బీహార్‌కు వెళ్లి అక్కడి రైతులకు సహాయం చేసి తెలంగాణ రైతుల నోట్లో మట్టికొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మంలో పంట నష్టపోయిన రైతులు రోడ్డెక్కి ధర్నా చేస్తే వారికి సంకెళ్లు వేయించారని, మహారాష్ట్రకు వెళ్లి ఆప్‌కీ బార్ కిసాన్‌కీ సర్కార్ అని ప్రచారం చేశాడని అన్నారు. సోనియాగాంధీ మాటకు కట్టుబడి తెలంగాణ ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాలకు, ఉద్యమం చేసిన వారికి న్యాయం చేస్తామన్నారు. టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ, నాయకులు గౌస్, నర్సయ్య, ఆడెపు ప్రభాకర్, శ్రీనివాస్, నీలి రవీందర్, శ్రీనాథ్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న హనుమంతరావు

ప్రపంచ సైకిల్ దినోత్సవం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న స్థానికులు

సిరిసిల్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్, రాజన్న సిరిసిల్ల జిల్లా న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, అసోసియేషన్ అధ్యక్షుడు యెల్లె రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోచం పల్లి రాజు, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి మల్లేశం, కోశాధికారి బొద్దుల బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన జడ్పీ సీఈవో



పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

ముస్తాబాద్, జూన్ 3: మండలంలోని గూడూరు ప్రగతి భవన్‌లో కొనసాగుతున్న పనులను జడ్పీ సీఈవో ఉమారాణి సోమవారం పరిశీలించారు. రూ.లక్ష జడ్పీ నిధులతో ప్రగతి భవన్ ఆవరణలో బోరు మోటారును ఏర్పాటును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

ఇల్లంతకుంట, జూన్ 3: ఆదర్శ పాఠశాలలో ప్రవేశం పొందే విద్యార్థులు ఈ నెల 11లోగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ప్రిన్సిపాల్ మధూకర్ ఒక ప్రకటనలో కోరారు. రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాల ఆవరణలో 6వ తరగతిలో ప్రవేశం కోసం జరిగిన పరీక్ష ఫలితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. 6వతరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాల కోసం టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

వ్యవసాయ సామగ్రి చోరీ

ఇల్లంతకుంట, జూన్ 3: మండల కేంద్రంలో గొడుగు హరికుమార్ అనే రైతుకు చెందిన వ్యవసాయ పనిముట్లు చోరీకి గురయ్యాయి. వ్యవసాయ బావివద్ద ఉంచిన రూ.42 వేల విలువైన పనిముట్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు తెలిపారు. వ్యవసాయ బావుల వద్ద తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని కోరాడు.

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం



రాజన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

వేములవాడ టౌన్, జూన్ 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో వేములవాడకు చేరుకున్న భక్తులు ఆలయ వసతిగదులతోపాటు ప్రైవేటు గదుల్లో విడిది చేశారు. సోమవారం తెల్లవారు జామున కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి స్వామివారి ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో సుమారు నాలుగు గంటలపాటు నిరీక్షించారు. అనంతరం భీమేశ్వర, బద్దిపోచమ్మ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. సూపరింటెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, అల్లి శంకర్, తిరుపతిరావు, అశోక్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న ఈవో

ఆలయ ఈవో రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో రాజన్న ఆలయ స్థానాచార్యులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఈవో రామకృష్ణ

గ్రీవెన్స్‌డేతో సత్వర న్యాయం



సమస్య వింటున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, జూన్ 3: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్‌డే ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 22 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నామని అన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ నిర్వహిస్తున్నామని, అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంబిస్తున్నామని తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తున్నట్లు చెప్పారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణం.. నోటీసులు

కోనరావుపేట, జూన్ 3: కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా చేపట్టిన గృహ నిర్మాణ పనులు ఆపాలని పంచాయతీ కార్యదర్శి సోమవారం నోటీసులు జారీ చేశారు. గ్రామానికి చెందిన గంప ధనలక్ష్మి అనుమతి లేకుండా గృహ నిర్మాణం చేపట్టారని తెలుసుకొని పంచాయతీ కార్యదర్శి కవిత గత నెల 23న నోటీసు జారీ చేశారు. నిర్మాణం ఆపకపోవడంతో సోమవారం తిరిగి నోటీసులు జారీ చేశారు. ఇంటి నిర్మాణంపై సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో గృహ నిర్మాణాన్ని ఆపడం కాకుండా సంబంధిత అధికారుల చేత కూల్చి వేయిస్తామని హెచ్చరించారు.

రెస్టారెంట్ల తనిఖీ

కోల్‌సిటీ, జూన్ 3: రామగుండం కార్పొరేషన్‌లో సోమవారం పలు రెస్టారెంట్లలో ప్రజాఆరోగ్య విభాగం అధికారులు తనిఖీ నిర్వహించారు. రెస్టారెంట్లలో నిల్వ ఉంచిన గడువు తేదీ దాటిన పదార్థాలను గుర్తించారు. గడువు దాటిన, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారాన్ని తయారు చేస్తున్న రెస్టారెంట్లను గుర్తించి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాం, నాగభూషణం, సునీల్, కిరణ్, వైకుంఠం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు.









కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● ఆర్టీసీ డిపో అధికారులకు ఏఐటీయూసీ వినతి

కోల్‌సిటీటౌన్, జూన్ 3: గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కాంట్రాక్టర్ ఎంఎస్ రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏగౌస్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖ ని ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ను సూపర్‌వైజర్ రమేష్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రమేష్‌ను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన వేతనాలు చెల్లించడం లేదని, కార్మికులకు ఇచ్చే వేతనం నుంచి కాంట్రాక్టర్ ఎంఎస్‌రెడ్డి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నా రు. గత నాలుగేళ్లుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకర మన్నారు. ఈవిషయమై కొన్ని నెలల క్రితం డిపో మేనేజర్, కాంట్రాక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు శివ, రాజు, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.


డిపో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు






వడదెబ్బతో ఒకరి మృతి

గంగాధర, జూన్ 3: గంగాధర మండలం తాడిజెర్రిలో వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుంటుకు మల్లయ్య(68) కుటుంబం రేకుల ఇంట్లో నివసిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఎండ తీవ్రతకు తీవ్ర అనారోగ్యానికి గురైన మల్లయ్యను కుటుంబీకులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన మల్లయ్య దహన సంస్కారాలకు గ్రామస్థులు విరాళం అందించి కార్యక్రమం నిర్వహించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

రామడుగు, జూన్ 3 : మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన కొత్త భూమయ్యకు చెందిన ఆవు పిడుగుపాటుతో ఆదివారం మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల పాడి ఆవు మృతి చెందడంతో రైతు రోధిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.





ముగ్గురిపై కత్తితో దాడి

● ఒకరి పరిస్థితి విషమం.. ఇద్దరికి గాయాలు

కోరుట్ల, జూన్ 3: టాయిలెట్ రూం శుభ్రపరిచే విషయంలో చోటు చేసుకున్న గొడవలో ముగ్గురిపై కత్తితో పొడిచి గాయపరిచిన సంఘటన కోరుట్ల పట్టణంలోని హాజీపుర కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు... బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలోని ఓ ఇంట్లో హజర్ పాషా, షేక్‌షఫీ అనే వ్యక్తులు వారి కుటుంబ సభ్యులతో కిరాయి ఇంట్లో వేరువేరుగా నివాసం ఉంటున్నారు. హజార్ పాషా తన భార్యతో నివాసం ఉంటూ పట్టణంలో పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేస్తుంటాడు. షేక్‌షఫీ ఇద్దరు పిల్లలు భార్య, మామతో నివాసం ఉంటూ పట్టణంలో చిరు వ్యాపారం చేస్తుంటాడు. వీరి ఇద్దరి కుటుంబాల మధ్య తరచుగా గొడవ జరుగుతోంది. సోమవారం హజర్ పాషా, షేక్‌షఫీ మధ్య గొడవ జరిగి ఉద్రిక్తతతకు దారితీసింది. గమనించిన షేక్‌షఫీ మామ సయ్యద్ మొహినోద్దీన్, ఆయన కూతురు సనా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే కోపోద్రిక్తుడైన హజర్‌పాషా పక్కనే తోపుడు బండిపైన ఉన్న కత్తితో దాడి చేయడంతో దాడిలో మొహినోద్దీన్‌తో పాటు సనా గాయపడ్డారు. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న గోదావరి గమనించి వారిని వారించే ప్రయత్నం చేయగా అమెపై కూడా హజర్ దాడి చేసాడు. సంఘటనలో మహినోద్దీన్ మెడ ప్రాతంలో తీవ్ర గాయంకాగా సనా, గోదావరి స్వల్పగాయాల పాలయ్యారు. మోహినోద్దిన్ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. షేక్‌షఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడి హత్య

● పాడె మోసిన ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మారం, జూన్ 3: ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు రేండ్ల నరేష్(40) హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి కటికెనపల్లి గ్రామంలో నరేష్ నూతన గృహ నిర్మాణ పనులు చేసుకుంటున్నాడు. అదే క్రమంలో ఆరుగురు వ్యక్తులు కలసి మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడి చేశారు. వీరి దాడిలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం కటికెనపల్లిలో జరిగిన నరేష్ అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని పాడె మోశారు. నరేష్ అంతిమయాత్రకు గ్రామస్థులు తరలివచ్చారు. గ్రామంలో జరిగిన పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని పథకం ప్రకారమే నరేష్‌ను హత్య చేశారని పెద్దపల్లి సీఐ కృష్ణ తెలిపారు. హత్య కేసులో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తురిస్తున్నట్టు ఆయన తెలిపారు.

● పోలీసుల తీరుపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం


రేండ్ల నరేష్(ఫైల్)

పెద్దపల్లి పోలీస్‌ల పనితీరుపై త్వరలో సీఎంకు ఫిర్యాదు చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి అక్ష్మణ్‌కుమార్ తెలిపారు. సోమవారం కటికెనపల్లిలో కాంగ్రెస్ నాయకుడు నరేష్ హత్య ఘటన నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి పోలీసుల నిర్లక్ష్యం కారణంగా నరేష్ మృతి చెందాడని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఇక్కడి పోలీస్ యంత్రాంగం విఫలమైందని ఆయన ఆరోపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పెద్దపల్లి సీఐ, ఎస్సైలపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా విన్నవించనున్నట్టు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


వేంపేటలో గంగామాత ఆలయంలో కల్యాణం


భీంరాజ్‌పల్లెలో సీతారాముల కల్యాణ మహోత్సవం

మెట్‌పల్లి రూరల్, జూన్ 3: మండలంలోని వేంపేట గ్రామంలో గంగామాత ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని గంగపుత్ర కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు కన్నుల పండువగా జరిపారు. సోమవారం గ్రామంలోని గంగామాత ఆలయంలోని అమ్మవారికి పురోహితులు ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికుల ఉమ్మడి జిల్లా మాజీ డైరెక్టర్ కల్లెడ గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, గంగపుత్ర కమిటీ నాయకులు గంగారం, గంగన ర్సయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం

● గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లె గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సోమవారం కన్నుల పండువలా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొమ్మెన మాధవి -కుమార్, ధర్మకర్త చింతపంటి శశికళ-తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారులు గోవర్ధన నరసయ్య, సాయికృష్ణ ఆచార్యుల వేదమంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో స్థలం విక్రయించి మోసం

● నలుగురిపై కేసు, ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 3: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే స్థలాన్ని పలువురికి విక్రయించి కొనుగోలుదారును మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో నలుగురిపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒక నిందితుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశాలపేట గ్రామానికి చెందిన (ప్రస్తుతం మహారాష్ట్రలోని పూణేలో నివాసం) గంగిరెడ్డి భీంరెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబర్ 277లో 167 గజాల ఇంటిస్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈ స్థలాన్ని గోపడి వీరరావు నుంచి పద్మలత, ఆమె వద్ద నుంచి మూల కిషన్‌రెడ్డి కొనుగోలు చేయగా అతడి నుంచి బాధితుడైన గంగిరెడ్డి భీంరెడ్డి కొనుగోలు చేశాడు. ఇదిలా ఉండగా బాధితుడి స్నేహితుడైన లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సునిల్‌లు కలిసి గంగిరెడ్డి భీంరెడ్డి ఏళ్ల తరబడిగా పూణేలో నివాసముంటున్నాడని గ్రహించి ఆ స్థలాన్ని కాజేయాలని కుట్ర పన్నారు. గోపడి వీరరావు కొడుకైన గోపడి మాధవరావుతో లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి కుమ్మక్కై, కిరణ్‌రెడ్డి తల్లి అయిన లక్కిరెడ్డి సుకన్య పేరిట డబుల్ రిజిస్ట్రేషన్ చేయించడమే గాక ఆ స్థలం పక్కనే ఉన్న 146 గజాల ఖాళీ స్థలాన్ని కూడా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, సాక్ష్యంగా సునీల్ వున్నాడు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. ఆ స్థలం తనదని బాధితుడు వెళ్లి నిర్మాణాన్ని అడ్డుకోబోగా వారించి, మళ్లీ వస్తే చంపుతానని బెదిరింపులకు గురిచేశారు. ఈ మేరకు బాధితుడు గంగిరెడ్డి భీంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులు గోపడి మాధవరావు, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, లక్కిరెడ్డి సుకన్య, సునీల్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు లక్కిరెడ్డి గోపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని సోమవారం రాత్రి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి ఆదేశాలతో నిందితుడిని జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాద బాధ్యులను శిక్షించాలి


గోరంటాలలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

గంభీరావుపేట, జూన్ 3 : గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లపల్లి ఎల్లయ్య (60) అనే వ్యక్తి మృతిచెందగా ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. గోరంటాలకు చెందిన గొల్లపల్లి ఎల్లయ్య అనే వ్యవసాయ కూలీ ఆదివారం సైకిల్‌పై మూలపల్లె వెళ్లి తిరిగి వస్తున్నాడు. కామారెడ్డి వైపు నుంచి గజసింగవరం వైపు వెళ్తున్న కారు ఎల్లయ్యను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన ఎల్లయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కొద్ది సేపటికే మృతి చెందాడు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఎల్లయ్య మృతి చెందాడని మృతుడి బంధువులు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. ఎల్లయ్య మృతికి కారణమైన కారు డ్రైవర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, మృతుడికి కుటుంబానికి పరిహారం చెల్లించాలని రాస్తారోకో చేశారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీస్‌లు అక్కడికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అతివేగంగా నడపడంతో ఎల్లయ్య మరణించాడని, వెంటనే కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని, మృతుడు ఎల్లయ్య కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహం తీసుకువచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని భీష్మించడంతో సీఐ శ్రీనివాస్‌గౌడ్ సముదాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

టీకా వికటించి చిన్నారి మృతి

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: టీకా వికటించి తమ చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బుర్క ఇషిత - రాకేశ్ దంపతులకు కూతురు అన్విశ్రీ(4 నెలలు) ఉంది. గత నెల 29న చిన్నారి అన్విశ్రీకి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో టీకా వేయించారు. అప్పటి నుంచి చిన్నారి తీవ్ర జ్వరం, విరేచనాలతో అస్వస్థతకు గురైంది. దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మందులను అందించి పంపించారు. సోమవారం పరిస్థితి విషమించి చిన్నారి మృతి చెందింది. టీకా వికటించడంతోనే తమ చిన్నారి చనిపోయిందని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. విచారణ జరిపి ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వైద్యురాలు స్రవంతిని సంప్రదించగా టీకా వికటించి చిన్నారి మృతి చెందిందనే తల్లిదండ్రుల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇషిత ఏడో నెల గర్భిణిగా ఉన్న సమయంలో కడుపులోని బిడ్డ గుండెకు రంధ్రం ఉందని గుర్తించి వారికి వివరించామన్నారు. గత నెల 29న చిన్నారికి పెంటా వ్యాక్సిన్ వేశామని తెలిపారు. చిన్నారి మృతికి టీకా కారణం కాదని తెలిపారు.

ఎల్ఎల్‌బి నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 3: ఎస్‌యూ పరిధిలోని ఎల్.ఎల్.బీ నాలుగు, ఆరో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాద రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 11వ తేదీ తుది గడువు అని,300/- అపరాద రుసుంతో 14వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్ వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష

గణేశ్‌నగర్,జూన్ 3 : ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్.ఎం నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు ఎలాంటి అపరాద రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 11వ తేదీ తుది గడువు అని,300/ల అపరాద రుసుంతో 14వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్ వి శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు సరికాదు

● మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హన్మంతరావు


కొండగట్టులో అంజన్న దర్శనం చేసుకుని వస్తున్న వీహెచ్

మల్యాల, జూన్ 3: దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదని, అభివృద్ధి చేసి ప్రజల నుంచి ఓట్లు అడగాలే తప్ప దేవుని పేరు చెప్పి ఓట్లు తీసుకునే ఆచారం పక్కన పెట్టాలని మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. కొండగట్టు అంజనేయస్వామిని సోమవారం దర్శించుకున్నారు. స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి చేయకుండా అయోధ్య పేరు చెప్పి ఓట్లు అడిగిన బీజేపీకి అబద్దాలు చెప్పి ఓట్లు అడిగిన కేసీఆర్ గతే పడుతుందని విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టుకు 500కోట్లు అని ప్రకటించి ఇవ్వకపోవడంతోనే బీఆర్ఎస్‌ను కొండగట్టు అంజన్న అధికారంలోకి రాకుండా చేశారని, ప్రజలతో పాటు దేవుళ్లతోనూ అబద్దాలు ఆడడం కేసీఆర్‌కు అలవాటేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండగట్టు దేవస్థానం అభివృద్ధి కోసం ఈ ప్రాంతం వాసులు అనేక ఆశలు పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి ఇక్కడ సౌకర్యాలు, సదుపాయాల కోసం విన్నవించి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమి విజయం సాధించాలని అంజనేయస్వామిని కోరుకున్నట్లు వీహెచ్ తెలిపారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి అట్టడుగు వర్గాల ప్రజలకు, జనాభా ప్రతిపాదికన అందాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తారని చెప్పారు. బడుగు బలహీన వర్గాల కోసం రాహుల్‌గాంధీ పోరాడుతుండగా మరో నాయకుడు దేవుళ్ల పేరిట ఓట్లు అడిగి కేవలం ధనవంతులకే లాభం చేస్తున్నారని పరోక్షంగా ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ఆయన వెంట దొంగ ఆనందరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాంలింగారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్, నేరెళ్ల సతీశ్‌రెడ్డి, నాయకులు ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సంత ప్రకాష్‌రెడ్డి, గాజుల అజయ్, నల్లపు మల్లేశం తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన సివిల్స్ ర్యాంకర్


సివిల్స్ ర్యాంకర్ సాయికిరణ్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రామడుగు, జూన్ 3: కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించాడు. కాగా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని తల్లి లక్ష్మీతో హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం సాయికిరణ్‌ను శాలువాతో సన్మానించారు. పేదరికంతో ఉన్నత చదువులు చదివించిన తల్లి లక్ష్మీని సీఎం అభినందించారు. పోస్టింగ్ తీసుకున్న తర్వాత తనను మరోసారి కలవాలని సాయికిరణ్‌ను సీఎం కోరారు. మాజీ ఎంపీపీ వీర్ల నర్సింగరావు తదితరులు ఉన్నారు.

హనుమాన్ జయంతి ఆదాయం రూ.1.51కోట్లు

మల్యాల, జూన్ 3: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో గత నెల 30నుంచి ఈ నెల 1వరకు జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దేవస్థానానికి రూ.1,51,38,490ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దీక్ష విరమణ టికెట్ల ద్వారా రూ.31,09,700, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.9,76,150, ప్రత్యేక దర్శనం రూ. 21,77,500, ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు. రూ.76,42,000ల లడ్డూ విక్రయాలు, రూ.12,33,140ల పులిహోర విక్రయాలు జరిగినట్లు వివరించారు. ఇందులో లడ్డూ, పులిహోర విక్రయాలు ద్వారా వచ్చిన సొమ్ములు పూర్తి స్థాయిలో ఆదాయం కాకపోయిప్పటికీ అధికారులు ఆదాయంగా పేర్కొంటున్నారు. గతేడాది దేవస్థానానికి హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా రూ.1.30,43,525 సమకూరగా ఈ సారి రూ.20,64,965 అధికంగా వచ్చినట్లు అయింది.

భర్త మాట్లాడడం లేదని భార్య ఆత్మహత్య


మమత (ఫైల్)

గన్నేరువరం, జూన్ 3: భర్త తనతో సరిగా మాట్లాడడం లేదని తీవ్ర మనస్థాపం చెందిన భార్య ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గన్నేరువరం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పత్తి మమత(27) దుర్గాప్రసాద్‌లకు 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 10 సంవత్సరాల కొడుకు ఉన్నాడు. రెండు నెలల క్రితం భర్త దుర్గాప్రసాద్ ఉపాధి కోసం జార్ఖండ్‌కు వెళ్లాడు. భర్త జార్ఖండ్‌కి వెళ్ళినప్పటి నుంచి మాట్లాడడం లేదని కుటుంబ పోషణకు డబ్బులు పంపడం లేదని తన తండ్రి జోగయ్యకు చెప్పు కుంటూ బాధపడేది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన మమత సోమవారం తన ఇంటిలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి టేకు జోగ య్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూన్ 3: అప్పు తీర్చే మార్గం లేక మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన వడకాపురం శ్రీనివాస్(44) చెట్టుకు ఉరేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ తెలిపి న వివరాల ప్రకారం.. పడకల్ గ్రామానికి చెందిన వడకాపురం శ్రీనివాస్ రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీనివాస్ కోసం వెతుకుతున్నారు. సోమవారం ఓ రైతు తన పొలంలోకి వెళ్లగా అక్కడ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీనివాస్ గతంలో ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ కొనుగోలు చేసి అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేని బెంగతో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భీమారం, జూన్ 3: మండలంలోని గోవిందారం గ్రామంలో గొంటి స్వరూప-స్వామికి చెందిన గేదె సోమవారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. సంఘటనా స్థలానికి విద్యుత్ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులు వచ్చి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కరండ్ల మధుకర్, ఎంపీటీసీ పూర్ణిమప్రభాకర్, వనపర్తి దశరథం, రాగేటి గంగాధర్, పుల్లూరి దేవయ్య కోరుతున్నారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య


లక్ష్మీ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో మాదాసు లక్ష్మీ (45) అనే వివాహిత అప్పుల బాధతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి మాదాసు లక్ష్మీ-నర్సింలు దంపతులు దినసరి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. సరైన పనులు లభించకపోవడంతో ఐదేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పు చేసి నర్సింలు బహ్రెయిన్ వలస వెళ్లాడు. చాలీచాలని వేతనంతో పనులు చేసినా అప్పులు తీరలేదు. మూడేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన రెండేళ్ల తర్వాత తిరిగి పయనమయ్యాడు. తండ్రి గల్ఫ్ దేశానికి వలస వెళ్లిన అప్పు తీరకపోవడంతో కొడుకు నాని మరో రూ.2 లక్షలు అప్పు చేసి ఏడాది కిందట దుబాయికి వెళ్లాడు. తండ్రి నర్సింలు బహ్రెయిన్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదానికి గురై కదలలేని స్థితికి చేరుకున్నాడు. అక్కడ చికిత్స పొందిన ఆయన మూడు నెలల కిందట ఇంటికి వచ్చాడు. ఓ వైపు కదలలేని భర్త.. మరో వైపు అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన లక్ష్మీ ఇంట్లో ఉరేసుకుంది. భర్త నర్సింలు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్ఐ విధులకు ఆటంకం

● యువకులపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 3: తీగలగుట్టపల్లిలోని అపోలోరీచ్ ఆసుపత్రి వద్ద ఆదివారం రాత్రి జరిగిన గొడవకు సంబంధించి ఎస్ఐ విధులను ఆటంకపరిచి నందుకు సుభాష్‌నగర్‌కు చెందిన యువకులపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారని తెలిసింది. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కాంగ్రెస్ నాయకుడిపై ఆదివారం దాడి జరగ్గా అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి సుభాష్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు ఆసుపత్రి వద్దకు వెళ్లగా అక్కడ గొడవ జరగకుండా విధుల్లో ఉన్న ధర్మారం ఎస్ఐ సత్యనారాయణ ఇరువర్గాల వారికి సర్దిచెబుతుండగా దురుసుగా ప్రవర్తించారు. ఈ మేరకు తన విధులను ఆటంకపరిచారని ఎస్ఐ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దొంగతనం కేసులో ఒకరికి జైలు

సిరిసిల్ల రూరల్, జూన్ 3: ద్విచక్రవాహనాలను దొంగతనం చేసిన మూడు కేసుల్లో ఒకరికి సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన సోమవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏప్రిల్ 2వ తేదీన నేరెళ్లకు చెందిన మీసాల బాలరాజు తన వాహనాన్ని సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద పార్క్ చేశాడు. ఏప్రిల్ 3వ తేదీన పట్టణంలోని సాయినగర్‌కు చెందిన వీరబత్తిని మహేష్ తన వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్క్ చేశాడు. ఏప్రిల్ 5వ తేదీన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన వాసాల శివకుమార్ తన వాహనాన్ని కొత్త బస్టాండ్‌లో పార్క్ చేశాడు. ఈ మూడు వాహనాలు చోరీకి గురైనట్లు బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని అజం గంజ్‌కు చెందిన మలావత్ తులసీరాంను రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం ఎస్సై శ్రీనివాసరావు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ నిందితుడిని ప్రవేశపెట్టారు. నిందితుడు మేజిస్ట్రేట్ ముందు నేరాన్ని అంగీకరించడంతో సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మామిడిపల్లిలో పూర్వ విద్యార్థులు

కోనరావుపేట, జూన్ 3 : కోనరావుపేట మండలం బావుసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో చదివిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం మామిడిపెల్లి శ్రీ సీతారాముల ఆలయ ఆవరణలో కలుసుకొని వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బావుసాయిపేట ప్రభుత్వ పాఠశాలలో 2010-11 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు మామిడిపల్లి సీతారాముల ఆలయంలో కలుసుకోవడంతో సందడిగా మారింది. వారి వారి తీపి జ్ఞాపకాలను నెమరు వేస్తూ ప్రస్తుతం ఎవరు ఏమి చేస్తున్నారో తెలుసుకొని సంతోషంగా గడిపారు.

పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

సిరిసిల్ల టౌన్, జూన్ 3: ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు దేవయ్య అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాలను సిరిసిల్ల పట్టణం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో తెలంగాణ సహజ వనరుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రగిరి గోపాలస్వామి, రాష్ట్ర కోశాధికారి వాసం మల్లేశంయాదవ్, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రాజకుమార్, చొప్పదండి లక్ష్మణ్, బీజేపీ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 3: మధ్యాహ్న భోజనం కార్మికుల పెండింగ్ బిల్లులు, జీతాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, కో కన్వీనర్ నడిగొట్టు లక్ష్మీ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అప్పులు చేసి నాణ్యమైన భోజనాన్ని తయారు చేసి అందిస్తున్నామన్నారు. ఇక నుంచి ప్రభుత్వమే నిత్యావసర సరుకులతోపాటు గ్యాస్, వంట సామగ్రి అందజేయాలని, కోడిగుడ్ల ధరలను పెంచాలని అన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు జీవో నంబరు 8- 2023 వెంటనే అమలు చేయాలని, బకాయి వేతనాలను చెల్లించడంతోపాటు కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు సీహెచ్‌లత, మణెమ్మ, లావణ్య, కనకలక్ష్మీ పాల్గొన్నారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

వీర్నపల్లి, జూన్ 3 : వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండాకు చెందిన భూక్య సరస్వతి (17) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. గతంలో జరిగిన పలు సంఘటనలపై మనోవేదనకు గురై సోమవారం ఉరేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

కథలాపూర్, జూన్ 3 : మండల కేంద్రంలోని రైతు డిపో, కనకదుర్గ, శ్రీసాయి విత్తన, పురుగు మందుల దుకాణాలను సోమవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన రసాయనిక పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీలర్లకు వివరించారు. రికార్డులను తనిఖీ చేసి రైతులకు విక్రయించిన ప్రతీ దానికి తప్పనిసరిగా రసీదు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఓ యోగిత, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు.


7 లోగా ప్రవేశాలు పొందాలి

కథలాపూర్, జూన్ 3 : మోడల్ స్కూల్‌లో 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఈ నెల 7 లోపు అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశ పరీక్ష ర్యాంకులను నోటీస్ బోర్డుపై అతికించామని పేర్కొన్నారు. నిర్ణీత ధృవపత్రాలతో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూన్ 3: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మాదాసు శంకరయ్య, మిర్యాల్‌కార్ పద్మ కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు లక్ష్మీనారాయణ, కిషన్, నర్సింలు, శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.

నేతల్లో ఉత్కంఠ





- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఏ పార్టీకి అనుకూలించేనో?
- మరికొద్ది గంటల్లో తేలనున్న ఫలితం
- రెండు సెగ్మెంట్లలో పోలైన ఓట్లు 3,53,935
- జోరుగా బెట్టింగ్‌లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. పోలింగ్, కౌంటింగ్‌కు మధ్య 20 రోజులకు పైగా ఎదురు చూసిన ఆయా పార్టీల కార్యకర్తలు, ఓటర్లకు కొద్దిగంటల్లోనే ఫలితాలు బయటపడనున్నాయి. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరన్న తీర్పును మంగళవారం వెల్లడించడానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి తరలి వెళ్లడానికి ప్రధాన పార్టీల నాయకులు సిద్ధమయ్యారు. మరోవైపు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఏ పార్టీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందనే దానిపై బీఆర్ ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు లెక్కలు కడుతున్నారు. తర్జనభర్జన పడుతున్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు కావడంతో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో లోక్‌సభ ఓటింగ్ కూడా భిన్నంగా ఉంటుందనే భావిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో 4,72,735 మంది ఓటర్లు ఉండగా 3,53,935 ఓటు హక్కు వినియోగించుకున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 2,46,547 ఓటర్లు ఉండగా, 1ౘ85,573 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,19,749 మంది ఓటర్లకు 88,722 మంది ఓటు వేశారు. మహిళలు 1,26,791 మంది ఓటర్లు ఉండగా 96,847 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వేములవాడ సెగ్మెంట్లలో 2,26,188మంది ఓటర్లు ఉండగా 1,68,373 మంది ఓటు వేశారు. ఇందులో పురుషులు 1,08,091 మందికి 76,040 మంది, మహిళలు 1,18,065 మంది ఉండగా 92,322 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో ప్రధానంగా మహిళా ఓటర్లు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు సెగ్మెంట్లలో మహిళా ఓటర్లు 2,44,156 మంది ఉండగా 1,89,169 మంది ఓటు వినియోగించుకున్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 1,26,791 మంది మహిళా ఓటర్లు ఉండగా 96,847 మంది ఓటు వేశారు. పురుషుల కంటే 8125 మంది అధిక ఓటింగ్ జరిగింది. వేములవాడలో 1,18,065 మంది మహిళా ఓటర్లు ఉండగా 92,322 మంది ఓటు వేశారు. పురుషుల కంటే 16,282 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడంతో మహిళల ఓట్లు కాంగ్రెస్ వైపు పడి ఉంటాయనే ఆశాభావంతో ఉన్నారు.

● పెరిగిన ఓటింగ్ శాతం ఎటు వైపో?

సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగింది. ఓటింగ్ శాతం ఎవరికి లాభిస్తుందనే అంశంపై చర్చ సాగుతోంది. శాసనసభ ఎన్నికల్లో సిరిసిల్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్, వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గెలుపొందారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో బీఆర్ఎస్‌కు గతంలో కంటే ఓటింగ్ శాతం తగ్గింది. కాంగ్రెస్, బీజేపీకి పెరిగింది. వేములవాడలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. దీనిని దృష్టిలో పెట్టుకొని లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్ల సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటింగ్ పెంచుకోవడానికి కృషి చేసింది. వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన ప్రాబల్యాన్నితిరిగి నిలుపుకోవడానికి ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఓటింగ్ శాతం కూడా పెరగింది. ఓటింగ్ శాతం ఎవరికి లాభాన్ని చేకూరుస్తుందనేదానిపై చర్చ మొదలైంది. 2019లో సిరిసిల్ల సెగ్మెంట్‌లో 71.80 శాతం, వేములవాడలో 70.68 శాతం ఓటింగ్ జరిగింది. ఈసారి ఓటింగ్‌లో సిరిసిల్లలో 75.27 శాతం, వేములవాడలో 74.44 శాతం ఓటింగ్ జరిగింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 1,63,550 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు, బీజేపీకి 64,769 ఓట్లు, బీఆర్ఎస్‌కు 70,482 ఓట్లు లభించాయి. వేములవాడలో 1,45,641 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు, బీజేపీకి 73,290 ఓట్లు, బీఆర్ఎస్‌కు 47,399 ఓట్లు పోల్ అయ్యాయి. ఈ సారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ అన్ని పార్టీలు తమకు ఓటింగ్ శాతం పెరుగుతుందనే ధీమాతోనే ఉన్నాయి.

● బెట్టింగ్‌ల జోరు

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో బెట్టింగ్‌ల జోరు మొదలైంది. కౌంటింగ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్‌లు కొనసాగే పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే ఫలితాలపై బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య బెట్టింగ్‌లు కాసినట్లు తెలుస్తోంది. మరోవైపు కార్యకర్తలు, అభిమానుల మధ్య కూడా బెట్టింగ్‌లు మొదలయ్యాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్ల వేములవాడ సెగ్మెంట్లలో భిన్నమైన ఫలితాలే వచ్చాయి. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 1,63,550 ఓట్లు పోలవగా బీఆర్ఎస్‌కు 70,482 ఓట్లు, బీజేపీకి 64,769, కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు వచ్చాయి. వేములవాడ సెగ్మెంట్‌లో 1,45,641 ఓట్లు పోలవగా బీజేపీకి 72,290 ఓట్లు, బీఆర్ఎస్‌కు 47,399 ఓట్లు, కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు లభించాయి.

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సిరిసిల్లలో 1,88,872 ఓట్లు పోలవగా బీఆర్ఎస్‌కు 89,244 ఓట్లు, కాంగ్రెస్‌కు 59,557 ఓట్లు, బీజేపీకి 18,328 ఓట్లు లభించాయి. వేములవాడలో 1,74,145 ఓట్లు పోలవగా కాంగ్రెస్‌కు 71,451 ఓట్లు, బీఆర్ఎస్‌కు 56,870 ఓట్లు, బీజేపీకి 29,710 ఓట్లు లభించాయి. 2019 లోక్‌సభ, 2023 శాసనసభ ఫలితాలను పోలుస్తూ బెట్టింగ్‌లు సాగుతున్నాయి.

చెరువులో అక్రమంగా బావి తవ్వకం



బండపల్లిలో అక్రమంగా తవ్విన బావి

చందుర్తి, జూన్ 3: మండలంలోని బండపల్లి ఊర చెరువులో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా బావిని తవ్వి, సిమెంట్ గాజులు వేస్తున్నాడని, వెంటనే నిలిపి వేయాలని సంబంధిత అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో కొంత చెరువు భూమి ఆక్రమణకు గురైందని పేర్కొంటున్నారు. అక్రమంగా బావులు తవ్వి పొలాలకు నీటిని మళ్లిస్తే చెరువులో ఉన్న కాస్త నీటి నిల్వలు అడుగంటి పోతాయని, భూగర్భ జలాలు ఇంకి ఇళ్లలోని బోర్లు అడుగంటే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అక్రమ బోరు బావులను అరికట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ హరీష్‌ను వివరణ కోరగా తాము బావులు తవ్వకానికి అనుమతి ఇవ్వలేదన్నారు.

పనులను నిలిపివేయాలి

- గడ్డం రణధీర్ రెడ్డి, ఎంపీటీసీ, బండపల్లి



బండపల్లి గ్రామంలో ఎల్లంపల్లి ఫేజ్ 2 లో భాగంగా ఊర చెరువు నిర్మించారు. అందులో అక్రమంగా బావి తవ్వకాన్ని చేపట్టారు. నిలిపివేయాలని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాం. అధికారులు బావి నిర్మాణాన్ని నిలిపివేయాలి.

అసిస్టెంట్ హెల్పర్లకు

పదోన్నతులు కల్పించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు

సిరిసిల్ల రూరల్, జూన్ 3 : సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థలో పని చేస్తున్న అసిస్టెంట్ హెల్పర్లకు పదోన్నతులు కల్పించడంతోపాటు పీఆర్సీని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెస్ పరిధిలో 147 మంది అసిస్టెంట్ హెల్పర్‌లు 27-09-2018న అబ్జర్వ్ చేసుకున్నట్లు, 26-09-2020న ప్రొబేషన్ డిక్లేర్ చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు ప్రొబేషన్ డిక్లరై నాలుగేళ్లు గడిచినా పాలకవర్గం అసిస్టెంట్ హెల్పర్‌ల మీదా కక్షపూరిత ధోరణి అవలంబిస్తోందన్నారు. హెల్పర్‌లకు పదోన్నతి కల్పించడంలో జాప్యం జరిగిందన్నారు. దీనిపై 15-03- 2021న అసిస్టెంట్ హెల్పర్‌లకు పదోన్నతులు కల్పించాలని అప్పటి ఎండీ రామకృష్ణను అడిగితే 30 రోజులు గడువు ఇవ్వాలని కోరడంతోపాటు సమస్యను పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా లేఖ రాసిచ్చారన్నారు. ఇప్పటివరకు అసిస్టెంట్ హెల్పర్‌లకు పదోన్నతులను కల్పించలేదన్నారు. మరోసారి ఎండికి అసిస్టెంట్ హెల్పర్‌లకు పదోన్నతుల గురించి 23-08-2022 రోజన మొరపెట్టుకోగా 30 రోజుల్లో సమస్యలను పరిష్కారిస్తామని మరోసారి లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని, సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. సెస్‌లో పని చేస్తున్నవారికి 2022 నుంచి పీఆర్సీని వర్తింపజేశారని, అసిస్టెంట్ హెల్పర్‌లకు మాత్రం పీఆర్సీ ఇవ్వలేదని అన్నారు. పాలకవర్గంతోపాటు అధికారులు స్పందించాలని కోరారు.

సామల మల్లేశం ఆశయ సాధనకు కృషి చేయాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 3: సీపీఐ సీనియర్ నాయకుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం లహరి పంక్షన్ హాల్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన సామల మల్లేశం సంతాప సభను నిర్వహించారు. ముందుగా చాడ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, జిల్లా నాయకులు మల్లేశం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సంతాప సభలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ చేనేత కుటుంబంలో పుట్టిన సామల మల్లేశం కార్మిక సంఘాల నాయకుడిగా పోరాటాలు చేశారన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల ఆత్మహత్యలను నిర్మూలించడంలో కీలక పాత్రను పోషించారన్నారు. చేనేత, పవర్‌లూం, బీడీ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారన్నారు. సిరిసిల్ల కార్మిక భవనం నిర్మాణంలో, సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో నాడు కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో మల్లేశం కృషి ఎంతో ఉందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి మోసం చేస్తే బీఆర్ఎ పార్టీ దాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి, సీపీఐ సిద్దిపేట, పెద్దపల్లి జిల్లా కార్యదర్శులు మంద పవన్, తాండ్ర సదానందం, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సుతారి రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పంతం రవి, అజ్జ వేణు, కడారి రాములు, మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, అనసూయ, భూమిరెడ్డి, పవర్‌లూం, బీడీ కార్మికులు, సెకండ్ ఏఎన్ఎంలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు

కరీంనగర్ క్రైం, జూన్ 3: లోక్‌సభ ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటచేసుకోకుండా సీపీ అభిషేక్ మొహంతి ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. అడిషనల్ డీసీపీ నుంచి హోంగార్డుల వరకు 470 మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. కరీంనగర్‌లోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి పాస్ ఉన్నవారినే అనుమతించనున్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, మీడియా మినహా ఎవరినీ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు అనుమతించడంలేదు. ఇప్పటికే ఈవీఎంలు భద్రపరిచిన ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంల వద్ద మూడంచెల భద్రతను, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. కౌంటింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఎవరినీ అనుమతించకుండా, వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన ఎస్సారార్ కళాశాల వద్ద ఎలాంటి ఆటంకాలు, సంఘటనలు చోటు చేసుకోకుండా వాహనాల రాకపోకలను నిషేధించి ఇతర మార్గాలకు దారి మళ్లింపు చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు అనంతరం కూడా అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల ఫలితాలపై కొందరు బెట్టింగ్‌లకు కూడా పాల్పడుతున్నట్లు సమాచారం.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

గొల్లపల్లి, జూన్ 3: రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన సమగ్ర కులగణన చేపట్టాలని, ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవ రామ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గొల్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలను లెక్కలోకి తీసుకోకపోవడంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టామని, అలాంటి తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా త్వరితగతిన సమగ్ర కులగణను చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు గంపగుత్తగా 60 శాతం కాంగ్రెస్‌కు ఓట్లు వేయడంతోనే అధికారంలోకి వచ్చి సీఎంగా రేవంత్ రెడ్డి గద్దెనెక్కారన్నారు. ఇచ్చిన హామీల మేరకు వెంటనే సమగ్ర కులగణన చేపట్టాలని, బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం దక్కేలా చూడాలని అన్నారు.

తెలంగాణ తీసుకొచ్చింది కేసీఆరే



జెండా వందనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

- ● జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి

సిరిసిల్ల టౌన్, జూన్ 3: నీతిగా, నిజాయితీగా తెలంగాణ తీసుకొచ్చింది గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ అని మనం గర్వంగా చెప్పుకోవచ్చని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి నాయకులతో కలిసి రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు పరిస్థితులు, ఉద్యమ నేపథ్యం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రగతిని వివరిస్తూ డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడారు. గులాబీ జెండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటు చేసిందన్నారు. మంత్రి పదవుల కోసం కేసీఆర్ ఎప్పుడు రాజీనామాలు చేయలేదని, తెలంగాణ సాధన కోసం రాజీనామాలు చేశారని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషలతో ఉన్నారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కంకణ బద్ధులై ఉండాలన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం ఐక్యంగా ఉండాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రస్తుత ప్రభుత్వ తీరును ఎండగట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడురి ప్రవీణ్, జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ తీర్థపు మాధవి, జడ్పిటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గడ్డం నాగరాజు, ఎంపీపీలు, మాజీ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల ముగింపు కార్యక్రమాన్ని ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌక్‌లో గులాబీ జెండా ఎగురవేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రభుత్వం స్వర్ణయుగంలా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఎద్దండి నర్సింహరెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ సర్వర్‌పాషా, కొమ్ము బాలయ్య, నల్ల నర్సయ్య, రాచమడుగు సంతోష్‌రావు, మనోహర్, శీలం స్వామి, దబ్బెడ రాజు, గుండవేని సతీశ్, దొరగొల్ల బాలయ్య, జాల భిక్షపతి, కంచం నర్సింలు బాల్‌లక్ష్మీ, మంజుల, స్వర్ణలత, నవీన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సురేందర్‌రావు

మూతపడిన వాటర్ ప్లాంట్



శివంగాలపల్లిలోని వాటర్ ప్లాంట్

- పదేళ్ల క్రితం ఏర్పాటు
- ఆరు నెలలుగా మూత
- తాగునీటికి గ్రామస్థుల అవస్థలు

కోనరావుపేట, జూన్ 3: పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మూలన పడింది. ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉంటోంది. దీంతో తాగునీటి కోసం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో తాగునీటి సమస్య ప్రశ్నార్థకంగా మారింది. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో 200 కుటుంబాలు 900 జనాభా 674 మంది ఓటర్లు ఉంటారు. పది సంవత్సరాల క్రితం సేఫ్ నిధుల ద్వారా అప్పటి ఎమ్మెల్యే రమేష్ బాబు శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆరు నెలల క్రితం వరకు పనిచేసిన వాటర్ ప్లాంట్ మిషన్లు చెడిపోయాయి. దీంతో ఆరు నెలలుగా మూతపడి ఉంటోంది. కొత్త మిషనరీ ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్థులు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోనరావుపేట మండల కేంద్రానికి వచ్చి మంచి నీటిని తీసుకెళ్తున్నారు. మరోవైపు ఎండలు మండుతుండడంతో మంచినీటి సమస్య ఆ గ్రామానికి తీవ్రస్థాయికి చేరుకుంది. అధికారులు, పాలకులు స్పందించి గ్రామంలో శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయాలి

- సురేష్ యాదవ్, మాజీ సర్పంచ్



శివంగాలపల్లి గ్రామంలో పది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మూతపడింది. మిషనరీ చెడిపోవడంతో వాటర్ ప్లాంట్‌ను మూసి వేశారు. ప్రభుత్వం స్పందించి కొత్తగా శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మంచి నీటిని అందించాలని కోరుతున్నాం.